# ప్రకటన పద్ధతులు

గోరా శాస్త్రి

మా సుబ్బారాయుణ్ణి మీ రెప్పుడూ చూసి ఉండరు. ఒకవేళ కొందరు అదృష్ట వశాన చూసి ఉన్నా, వాడు మా సుబ్బారాయుడే అని మీకు తెలిసుండదు. ఇంతకూ జన బాహుళ్యానికంతకీ, వాళ్లకి అక్కరలేకపోయినా తెలిసిఉన్నంత నిటారు మనిషేం కాడు సుబ్బారాయుడు. వాడేం రాజకీయ నాయకుడు కాడు. "మళ్లీ యుద్ధం వస్తుందిట నిజమేనటా?" అని నిజంగానే భయపడి అప్పుడప్పుడు నన్నడుగుతాడు. యుద్ధం అంటే అంత భయపడేవాడికి ఇక రాజకీయాలేమిటి? పోనీ సినిమా నటుడా అంటే అదీ కాదు. వాడు ఉత్త మామూలు మనిషి. సగటు మనిషి.

కాని వాడు మా సుబ్బారాయుడు. సాక్షాత్తూ నాకు మేనమామ కొడుకు. ఎప్పుడైనా వాడికి నేను ఉత్తరం రాయడం అంటూ జరిగితే, "ప్రియమైన బావా!" అని సంబోధించ దలుచుకున్నాను. మావాడిది మహేంద్రవాడ. ఆ చుట్టుపక్కల వాణ్ణి తెలియనివాళ్లు లేరు. అటువంటివాడు ఆ గడ్డమీద బతికున్నందుకు నిజంగా సంతోషించనివాడు లేడు. ఒక అయిదు నిమిషాలు సుబ్బారాయుడితో మాటాడితే చాలు, మన కష్టాలన్నీ మరిచిపోయి, కేవలం బతికి ఉండి ఊపిరి పీల్చడం యెంత హాయి! ఎంత అదృష్టం! అనుకుంటాం. ఈ మధ్యనే ఓనాటి సాయంత్రం వాణ్ణి చూడ్డానికి వాడింటికి వెళ్ళాను. అడావుడిగా హాల్లో పచార్లు చేస్తున్నాడు. "ఏంరా సుబ్బారాయుడూ! సాయంత్రం ఎక్కడికీ వెళ్లలేదూ?" అన్నాను. నన్ను చూడగానే వాడి మొహం చాటంత అయింది. "ఇదిగో! రారా,' రా. వెళ్లడమేమిట్రా, తీరికలేక చస్తూంటేనూ! ఏదీ! ఇప్పుడే ఆ కొత్త సైకిలు నడవలో పెట్టి, లోపలికి వెళ్ళి సిల్కు కండువా స్టాండుకి తగిలించి కూర్చున్నాను. మా ఆవిడ కాఫీ తెచ్చింది. ఈ వెధవ వెండి గ్లాసుల్లో కాఫీ ఒకంతట చల్లారదొకేయ్! వెండి కొత్తదయితే మరీను! కూర్చో! అబ్బ! ప్రాణం హైరానగా ఉందిరా! ఇవాళ పగలల్లా జమీందారుగారి కోర్ట్లో అదే తిరిగాననుకో! మళ్ళీ రాత్రి రమ్మన్నాడు."— గుక్క తిప్పుకోకుండా ఇంత చెప్పాడు.

ఆలోచించండి! కొత్త సైకిలు, సిల్కు కండువా, వెండిగ్లాసు, (అందులో కొత్తది) జమీందారుగారి కోరు- జమీందారుతో మళ్లీ పని! ఇదీ వాడివరస. కదిపితే చాలు. టైమెంత అయిందని అడగండి, "టైమా, ఉండండి, యీ రిస్టువాచీ మొహాన మొన్ననే రెండు వందల యాభై పోసి కొన్నాను. టైము కోసం కాకపోతే మరి దేనికి?" అంటాడు. "సుబ్బారాయుడూ, భోజనం అయిందిరా?" అనండి. "ఏం భోజనంరా, యీ మధ్య బెంగుళూరు కాబేజీ ఉండే సరిగ్గా ఉడకడమే లేదు, కడుపు నొప్పి. 'చస్తున్నాను, ఒద్దంటే యింట్లో వాళ్లు వినరు" అంటాడు వెంటనే. ఈ ధోరణిలో సుబ్బారాయుడు అజేయుడు.

* * *

మనలో ప్రతి ఒక్కడి లోనూ కొంత సుబ్బారాయుడి అంశ ఉండితీరుతుంది. మనమంతా సుబ్బారాయుడితనం అంతో యింతో వలచి వరించి అనువు దొరికినపుడల్లా ఆచరణలో పెడుతున్నవాళ్ళమే. కొందరం అది సుబ్బారాయుడివలె వేటవెల్లంగా ప్రదర్శిస్తాం, మరికొందరం కొంత నాజూగ్గా, అంతర్లీనంగా ముత్యంలో నీరు వలె, లేదా మహాకవి చెప్పినట్లు "ఘనతర ఘూర్జరీ కుచయుగ క్రియ" గూఢంగా ఉంచుతాం. అంతే తేడా. అహం అన్నది ఉన్నన్నాళ్లు దానికి ప్రకటన కావాలి. మూగపోయిన అహం మునీశ్వరుల కుంటుం

దేమో పీఠిమానిసికి దుర్లభం. "నాగరికత" అనబడేది నానాటికీ వృద్ధి చెందుతున్నకొద్దీ, అహానికి ప్రచారసాధనాలు కొత్త కొత్తవి కనిపెట్టబడుతున్నాయి. కాలాన్నీ, దూరాన్నీ అధిగమించిన మన యంత్రయుగ సాధన సంపత్తి మనకి క్షణంలో లక్షలాలదీ పరోక్ష ప్రేక్షకులను సమకూర్చి పెడుతుంది. కావలిస్తే. ఈ సదవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకుంటున్నవారు వ్యాపార ప్రకటనదారులు. ఏ వార్తాపత్రిక గాని, నిర్వార్తా పత్రిక గాని తిరగేసినా, మనకీ సత్యం కళ్ళముందు గోచరిస్తుంది. మామూలు పరిభాషలో, ఎడ్వర్ టైజ్ మెంట్లు అనేవి నేటి మన సమాజ జీవితంలో, విశిష్ట స్థానం ఆక్రమించుకున్నాయి. అచ్చుయంత్రం, పుస్తకాలు, వీటి తరువాత పత్రికలు, భారీ యెత్తున సరుకు ఉత్పత్తీ, వ్యాపారం, వీటితో పాటు సరుకును గురించిన ఎడ్వర్ టైజ్ మెంట్లు పత్రికలలో ప్రకటించడం... ఇలా ,పరిణామంలోని అంపచందాల లోతుపాతులన్నీ చరిత్ర పరిశోధకులకీ, పురాతత్వ శాస్త్రజ్ఞులకీ వదిలేద్దాం. మన జీవితకాలంలో మన అనుభూతులే నిజం. ఇవాళ ప్రపంచంలో ఏ భాషలో కొత్త భారీరకం పత్రిక తిరగేసినా రకరకాల వ్యాపార ప్రకటనలు నేత్రానందకరంగా మనకి గోచరిస్తాయి. ఇందులో చాలా వాటికి ప్రాలంబము స్త్రీ కాదు కాదు, మంచి ప్రాయంలో ఉన్న సుందరాంగి. ప్రకటన చెయ్యబడ్డ సరుకు, మోటారుకారు, గొట్టాం నుయ్యా, పొలం దున్నే ట్రాక్టరు, షర్టు బొత్తాం, ఆఫీసు కుర్చీ, రేజరు బ్లేడు,—ఏమైనా సరే. మన తెలుగు ప్రబంధ యుగం తరవాత స్త్రీమూర్తిని యింతగా ఆరాధించి ప్రచారం చేస్తున్నది యీ వ్యాపార ప్రకటనదారులే అనవలసి ఉంది. వెనకబడిన ఇండియా వంటి దేశాల్లో యీ కళ యింకా స్థాయిభారం అందుకోలేదు గాని, పాశ్చాత్యదేశాల్లో ఇది తారాపథం అందుకుంది. ఈ ఎడ్వర్ టైజ్ మెంట్లలోని స్త్రీల మోడల్సుగా ఉండి ఎందరో సర్వాంగ సుందరీమణులు లక్షలాది ధనం ఆర్జిస్తున్నారు. వీళ్లకి తర్ఫీదు నిచ్చి అందచందాలకు మెరుగు పెట్టే కళాశాలలు కూడా వెలిశాయి ఆ దేశాల్లో.

నేటి పత్రికలలో ఎడ్వర్ టైజ్ మెంట్లూ, వార్తలు లేక రచనలూ అని స్థూలంగా రెండు భాగాలు. ఏ భాగంవల్ల ప్రజలు ఎక్కువ ఆకర్షింపబడి ప్రజలు పత్రికలు కొంటున్నారన్నది వివాదాంశం. ఒక చిన్న సంఘటన చూడండి. మొన్నటి రెండవ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా నడుస్తున్న రోజుల్లో తీవ్రమైన కాగితం కరువు ఏర్పడింది. ఒక సుప్రసిద్ధ అమెరికా దినపత్రిక, యూరప్‌కు వెళ్ళే ప్రతులలో ఎడ్వర్ టైజు మెంట్లు మినహాయించి కేవలం వార్తల్ని మాత్రమే ముద్రించడానికి నిశ్చయించుకుని ఆ విషయం ముందుగా పాఠకులకి తెలియచేసింది. వెంటనే యూరప్‌లోని కొన్ని వందల మంది పాఠకులు ఆ పత్రికా కార్యాలయానికి టెలిగ్రాంలు యిచ్చారు—అంతగా అయితే వార్తలు తీసెయ్యండి గాని, ఎడ్వర్ టైజ్ మెంట్లు తీసెయ్యడానికి ఎంతమాత్రం వీల్లేదని. ఆ పత్రికలోని ఎడ్వర్ టైజ్ మెంట్లకు పాఠకులపై అంత సన్నిగూఢ సమ్మోహన శక్తి ఉందన్న మాట.

భారీ ఎత్తున సాగే యీ ఎడ్వర్ టైజ్ మెంట్లు - క్షమించాలి వ్యాపార ప్రకటనలు- ఇందాక మనం అనుకున్న 'అహం' అన్న దానికి గిలిగింతలు పెట్టి మనని అన్ని విధాలా రంజింప చేస్తాయి. అందులో రకాలు అనంతం. కొన్ని లాలిస్తాయి, బుజ్జగిస్తాయి. "నాయనా! నువ్వు మంచివాడివి. దొడ్డబుద్ధి కలవాడివి. అంచేత ఫలానా రకం సబ్బునే ఉపయోగించు. అప్పుడు చూడు నీ చర్మం ముఖమల్ వలె ఎలా ధగధగ లాడిపోతుందో! అంతే కాదు. రాత్రి నీకు మధుర స్వప్నాలు వస్తాయి; అందులో దేవకన్యలు కనబడతారు. నాయనా, వాళ్లు నీకు అమర సంగీతం వినిపిస్తారు"-ఇది ఒకరకం. మరికొన్ని మనను భయపెడతాయి. యీసడిస్తాయి. "అబ్బాయీ, నీ జుట్టు తెల్లబడింది. అమ్మాయీ నీ కోర్కె చల్లబడింది మీ ముఖంలో ముడతలు, నడకలో మందం-నడిమి వయస్సులోకి వచ్చేస్తున్నారు. ఆయినా ఫరవా లేదు, ఇప్పటికయినా మేలుకుని మా తల నూనె ఉపయోగించి, ముఖానికి మా లేపనం వాడండి. మళ్ళీ నిత్య యౌవనంతో ప్రకాశి

స్తారు.'' అంతేనా! ఇంత స్వల్ప ధనవ్యయంతో పోయిన యౌవనం ముక్కుకి తాడుకట్టి మళ్ళీ తీసుకురాగల్గడం సంభవమైతే, యిక నీతిచంద్రిక కారుడు చెప్పినట్లు "జీవితము బుద్బుద ప్రాయము: యౌవనము ఝరీ వేగతుల్యము" అన్న సూక్తి అబద్ధం అన్నమాట. ఏమయితేనేం, ఎడ్వర్ టైజ్ మెంటువాళ్లు చెప్పిందే నమ్మడం మనకి యిష్టం. మనకి యిష్టమైనవే వాళ్లు మనకి చెపుతారు. మనలోని సుబ్బారాయుడితనం నిత్య యౌవనాన్ని కోరుతుంది. నిత్య యౌవనం అనేది ప్రకృతి విరుద్ధం అని తెలుసు. అయినా లాభంలేదు.

ఒక పాశ్చాత్య తత్త్వవేత్త చెప్పినట్లు, అమాయకంగా కలలు కంటూండే చిన్నతనపు రోజుల్లో మనం జీవితంలో అన్నింటికీ అడ్డదార్లుంటాయని నమ్ముతాం. నామట్టుకు నేను నా తారుణ్యపు తొలిరోజుల్లో గాఢంగా నమ్మేవాడిని—ఒక లక్ష రూపాయలు గాని, ఒక జగదేక సుందరిని గాని సంపాదించడానికీ, కీర్తి ప్రతిష్ఠలు అందుకోడానికీ, అడ్డదారులుంటాయని. వయస్సుగడిచి అనుభవాలు మీద పడిన తరువాతకూడా యీ నమ్మకం మనని ఒకంతట వదలదు. యథార్థం వేరు, కల వేరు. తాత్వికులూ, గతితార్కిక భౌతికవాదులూ, ఎంత ఎలుగెత్తి అరచినా, మనలో అనేకులం సుబ్బరాయుళ్ళమే కాబట్టి కలలమీదనే మోజు. బైరాగి చిట్కామీదనే విశ్వాసం. జీవితంలో ఏదీ ఊరికే రాదనీ, మూల్యం ఏదో ఒక రూపంలో చెల్లించవలసి ఉంటుందనీ, మన అనుభవం. కాని-పత్రికలో ఒక ప్రకటన చూస్తాం. "ఉచితము: యిరవై తొమ్మిది వస్తువులు" అని పెద్ద అక్షరాలతో ఉంటుంది. మనకి నోరూరుతుంది. ఈ కంపెనీ ఎవడో దధీచీ, బలిచక్రవర్తిలాంటివాడు నడిపిస్తున్నాడు. ఒకటి కాదు, రెండు కాదు యిరవై తొమ్మిది వస్తువులు ఉచితంగా యిస్తున్నాడు-కొట్టేద్దామనిపిస్తుంది. ప్రకటన పూర్తిగా చదువుతాం. - ఆ కంపెనీ వారి దగ్గిర — దుంపరాష్ట్రం అనుకుందాం—ఒక తులం కొంటే. యిరవై నాలుగు బొత్తాములూ, మూడు పిన్నులూ, ఒక రిస్టు వాచీ, ఒక ముత్యాలహారం - యివి మనకి ఉచితంగా ఇవ్వబడతాయి. అర్థమయిందా? లేకపోతే. యీ మాటు అలాంటిది ఒకసారి తెప్పించి చూడండి. మరికొన్ని మన తెలివి తేటల్ని పొగుడుతాయి. "ఇది మేధావులంతా కాల్చే సిగరెట్టు"—"ఇది ఉన్నతోద్యోగులు వాడే తలనూనె" మనలో ఏ ఒక్కడు మేధావి కాడు? తన ఉద్యోగం చిన్నదైనా, పెద్దదయినా తనులేకపోతే ఆఫీసు నడుస్తుందని ఏ ఉద్యోగి నమ్ముతాడు? — ఇది చూడండి:"ఫలానా సబ్బు: తరతరాల ప్రపంచ సౌందర్యవతులంతా వాడారు"దీనికి మరి తిరుగులేదు. తను సౌందర్యవతి కాదని ఏ స్త్రీ అనుకుంటుంది?

స్వోత్కర్ష, ఆశ, మన మేధాశక్తిమీదా, సౌందర్యం మీదా నమ్మకం, రూపాయి చూస్తే మోజు, చుట్టుపక్కలవాళ్ళకంటే మనం అన్ని విధాలా గొప్పవాళ్ళమనే విశ్వాసం, అదిరుజువు చేసుకోందికి తహతహ—యివన్నీ మనం పైకి ఒప్పుకోంగాని, అందరిలోనూ యిత్కించిత్ ఉండి తీరుతాయి. మోతాదుగా ఉన్నంత వరకూ వాటివల్ల వచ్చే హానికూడా ఏమంత ఉండదు. ఇది గ్రహించిన మానవ మనస్తత్వ శాస్త్రజ్ఞులు కనకనే వ్యాపార ప్రకటనలు చేసేవారు మనల్ని ఇంత గొప్పచేసి అందలం ఎక్కిస్తారు. స్పష్టంగా మనం గొప్ప వాళ్ళం అనేస్తే అందం లేదు, నమ్మదగినదిగా ఉండదు కూడా. అంచేత పరోక్ష మార్గాల్లో మనని లాలించాలి. అలా చెయ్యడం మనకీ ఆనందంగానే ఉంటుంది. సూక్ష్మంగా చూస్తే, ఇది అవతల వాళ్లూ మనం, తెలిసీ తెలిసీ కలిసి ఆడుకునే ఆట. ఉభయతారకంగా ఉంటోంది కాబట్టి ఫరవాలేదు. ఆధునిక ప్రచార సాధనాలు అందించే వెచ్చని సుఖాల్లో యిదొకటి. అందుకే చూడండి: ఇందాక నేను చెప్పిన ప్రాలంబం. ప్రకటన చేయబడ్డ వస్తువు ఏదయినా, సాధారణంగా అందులో ఒక స్త్రీవిగ్రహం ఉంటుంది. అందులో ఎలాంటి స్త్రీ? సాక్షాత్తూ పెద్దన గారి వరూధిని. విద్యుల్లతా విగ్రహ, శతపత్రేక్షణ, చంచరీక చికుర చంద్రాస్య చక్రస్తని. రబ్బరు టైర్లు ప్రకటనకి స్త్రీ ప్రమేయం దేనికి? ఇనప్పెట్టె ఎడ్వర్ టైజ్ మెంటులో యువతి బొమ్మ దేనికి? — ఇలా మనం అడక్కూడదు.

అందమైన తోటల మధ్యగా ఖరీదైన మోటారులో దంపతులు పోతూంటారు. అంటుంది భార్య: "ఫలానా టైర్లు ఎంత చల్లగా మోటారును నడిపిస్తాయి అని!" అలాగే యువతి ఇనప్పెట్టె మీద చెయ్యి ఆన్చి అంటుంది: "నేనెప్పుడూ ఫలానా యినప్పెట్టె నే వాడతాను" అని. బొమ్మలో స్త్రీతో మనం వాదన పెట్టుకోవడం ఎలాగ? అందులోనూ అంత అందమైన స్త్రీతో! మొత్తం మీద యిది పురుష ప్రపంచం. ఉత్పత్తి దారుడూ, కొనుగోలు దారుడూ, సాధారణంగా పురుషులే. అందువల్ల ప్రకటనలలో స్త్రీ విగ్రహానికి యింత ప్రాముఖ్యం. ఇంత యంత్ర యుగంలోనూ, యింకా రసికత సక్రమంగానే పాలింప బడుతూందనడానికి యింతకన్న నిదర్శనం ఏం కావాలి?

మనలోని సుబ్బారాయుడి తనాన్ని చక్కిలిగింతలు పెట్టడానికి యింకో సూక్ష్మమైన మార్గం కూడా- పత్రికల ధర్మమా అని- ఉంది. పూర్వం కీర్తి ప్రయాణం చెయ్యడానికి చాలా కాలం పట్టేది. కాలం మారింది. యిప్పుడలా కాదు. సుప్రసిద్ధ రాజకీయ నాయకుడికి జలుబు చెయ్యడం, సుప్రసిద్ధ సినీ తారామణి భర్తకు విడాకులివ్వడం, సుప్రసిద్ధ క్రికెట్ యోధుడి భార్యా వియోగం-ఛాయా చిత్రాలతో సహా వివరాలన్నీ పత్రికలు మనకి క్షణంలో అందిస్తాయి. బాగానే ఉంది. అయితే మన సంగతో మరి? మనకు జలుబు కాదుకదా, ప్రమాదకరమైన జబ్బు చేసినా ఏ పత్రికా ప్రకటించదు. మా సుబ్బారాయుడి గతి ఏం కాను? వాడి వివాహం సంగతి, వాడి తల్లి పక్షవాతంతో చచ్చిపోయిన సంగతి లోకానికి ఎలా తెలుస్తుంది? ఫరవాలేదు. పత్రికలు అందుకూ మనకి అవకాశం కల్పించాయి. వాళ్లకి ప్రకటన ఛార్జీలు యిచ్చేస్తే మన స్వంత విషయం అంతా మనం నిరభ్యంతరంగా ప్రకటించుకోవచ్చు.

ప్రకటన పద్ధతులలో యిదో కొత్త రకం. అడ్డదారిని గొప్పతనం అందుకోడానికి బైరాగి చిట్కా. ఒకతను కొడుక్కి పెళ్ళి చేస్తాడు. వైభవంగానే చేస్తాడు. చాలామంది బంధువులు వచ్చారు. సంగీత కచ్చేరీలు జరిగేయి. అయితేనేం, అది వార్తగా లోకం పరిగ్రహించదు. పత్రికలవాళ్ళు వెయ్యరు. అంతమాత్రయిన ఆ పెద్దమనిషి ఊరుకుంటాడా? ఊరుకోడు. "కృతజ్ఞత" అని శీర్షిక పెట్టి ఒక పెద్ద రిపోర్టు తయారుచేస్తాడు. అందులో పైకి చెప్పే ఉద్దేశం పెళ్ళికి వచ్చినవారికీ, రాకుండా సందేశాలూ, కానుకలూ, పంపినవారికీ, కృతజ్ఞత చెప్పడం. ఇంతమందికీ పేరు పేరున చెప్పుకోవడం, ఉత్తరాలు రాయడం కష్టం కనక, ఉమ్మడిగా పత్రికద్వారా ఆ పని చేస్తున్నాడు. అంతవరకూ బాగానే ఉంది. కాని, రిపోర్టులో పెళ్ళికి ఏయే పెద్దలు హాజరయిందీ, వాళ్ళ వృత్తులూ, ఉద్యోగాలూ, సంగీత కచేరీల వివరణా, వధూవరులు ధరించిన దుస్తులూ, కానుకల తబిసీళ్ళూ, అన్నీ ఉంటాయి. వధూవరుల ఫోటో కూడా ఉంటుంది. పాఠకుడికి వీళ్లెవరో ముక్కూ మొహం కూడా తెలియకపోవచ్చు. తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా ఉండకపోవచ్చు. కాని అంతమాత్రాన ఎవరూ వెనుదీయరు.

ఇందులో పద్ధతులు యిలాగే అనంతం. ఒకాయన షష్టిపూర్తి చేసుకుంటాడు. వెంటనే పూర్తి వివరాలతో ఆ కార్యక్రమం అంతా పత్రికల్లో ప్రకటిస్తాడు. ఇంకొకాయన తల్లి మరణిస్తుంది. వెంటనే పత్రికలో ఎడ్వర్టైజ్మెంటు వేస్తారు. "ఫలానా వారం, తేదీ, గంట, అప్పుడు ఫలానా ఆమె తన 84 గో ఏట పక్షవాతంవల్ల మూడో కొడుకు యింట్లో మరణించింది. గొప్ప దైవభక్తురాలు. ఎన్నో దానధర్మాలు చేసింది. ఆమెకు నలుగురు కొడుకులూ, అయిదుగురు కుమార్తెలూ, ముప్ఫై ఆరుగురు మనుమలూ ఉన్నారు. పెద్ద కొడుకు డాక్టరు- రెండో కొడుకు-" యింత గ్రంథం ఉంటుంది ఆ ప్రకటనలో. అంతవరకూ ఆవిడ అనే ఒక జీవి యీ ప్రపంచంలో బతికివుందని మనకు తెలియకపోయినా, చచ్చిపోయాక మనకు సమస్తమైన వివరాలూ తెలుస్తాయి. నేను చదివినంతవరకూ, యీ ప్రకటనలలోని మనుషులంతా దాన ధర్మవంతులే, దైవభక్తులే, జీవితమంతా పుణ్యకార్యాల్లో గడిపినవారే. ఇలాంటి ప్రకటనలు చూసినపుడల్లా నేనూ వాళ్ళ ఆత్మ శాంతి కోసం ప్రార్థిస్తుంటాను.

స్వాతంత్ర్యం లభించాక యింకో కొత్త రకం ప్రకటనలు ముమ్మరం అయిపోయాయి. అకస్మాత్తుగా ఒకానొక ఫోటో పత్రికలో చూస్తాం. క్రింద యిలా రాసి ఉంటుంది, "సుప్రసిద్ధ తాటిపీచు వర్తకుడు ఫలానా గారు, తాటిపీచు వర్తకాన్ని గురించిన పరిశోధన నిమిత్తం నిన్న ఉదయం విమానంలో అమెరికా వెళ్ళారు" అని ఉంటుంది. ధన్యోస్మి అనుకుంటాం మనం.

ఈ రకం ప్రకటనలలో ఒక్కటి మాత్రం నేను జన్మలో మరిచిపోలేనిది చదివాను. ఈ మధ్య ఒక సత్పురుషుడు ఇలా ప్రకటించాడు: "ఫలానా డిపార్టుమెంటులో ఉద్యోగం చేస్తూ, నెలకు వెయ్యిరూపాయలు జీతం తెచ్చుకుంటున్న నా పెద్దకొడుక్కి వధువు కావాలని మేం చేసిన ప్రకటనపై యింకెవరూ దరఖాస్తులు పంపవద్దని ప్రార్థన. దరఖాస్తులు పంపిన 673 గ్గురికీ కృతజ్ఞత. అవి వీలయినంతత్వరలో పరిశీలింపబడును"—అని.

పై ప్రకటన సుబ్బారాయుడికి చదివి వినిపించాను. "ఏమంటావు సుబ్బారాయుడూ?" అన్నాను. వాడు కూడా కొత్త తెల్ల మొహం వేసి, "కాలం మారిందిరా, అబ్బీ!" అన్నాడు. నిజం. కాని కాలం ఎంత మారినా, సుబ్బారాయుడితనం మట్టుకు మానవుడు ఉన్నంత వరకూ ఉంటుంది.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

# రాను రాను పండిత నెహ్రూ—

## తుర్లపాటి వెంకటకుటుంబరావు

కాంగ్రెస్‌లో పండిట్ నెహ్రూ పరిస్థితి నానాటికి విచిత్రంగా, ఆయనపట్ల అభిమానం కలవారికి ఆందోళనకరంగా పరిణమిస్తున్నది. కాంగ్రెస్‌లోని కొందరు నాయకులు పండిట్ నెహ్రూకు వ్యతిరేకంగా ఒక వర్గాన్ని సృష్టించి, ఆయన ఆశయ లక్ష్యాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ, వచ్చే జనరల్ ఎన్నికలకు పిదప ఆయనను "త్రోసిరాజు" చేయాలని తీవ్రకృషి చేస్తూన్నారని ఇటీవల దేశంలో చెలరేగిన వదంతులను బెంగుళూర్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సంఘ సమావేశం, ఆపిదప మిస్టర్ రఫీ అహమ్మద్ కిద్వాయ్ చేసిన ప్రకటనలు మరింత ప్రోద్బలాన్ని చేకూర్చినవి. పండిట్ నెహ్రూ అభిమతం ఏవిధంగా త్రోసి పుచ్చబడుతున్నదో, కాంగ్రెస్‌లో సమైక్య సాధనకు ఆయన చేస్తున్న కృషికి ఎలా విఘాతాలు కల్పించబడుతున్నవో ఆసమావేశం చక్కగా నిరూపించింది. అంతే కాక, కాంగ్రెస్‌లోని అవినీతి పరులను అభివృద్ధి నిరోధకులను, కుల, మత తత్వవాదులను తొలగించి, ఆసంస్థను పండిట్ నెహ్రూ క్షాళనం చేయగలడని ఆశించిన వారికి బెంగుళూరు సమావేశం ఆశాభంగం కలిగించింది.

బెంగళూరు సమావేశం జరగక పూర్వం పండిట్ నెహ్రూయే కాంగ్రెస్ సంస్థనాయకత్వాన్ని కూడా స్వీకరించాలని, తద్వారా కాంగ్రెస్‌ను సంస్కరించి, దానిని పటిష్ఠంచేయాలని దేశంలో ఆందోళన జరిగింది. ఈ సూచనను బీహార్ ప్రధాని శ్రీ కృష్ణ సిన్హా, శ్రీ మహావీర్ త్యాగి మున్నగు ప్రముఖులు బలపరచారు. అయితే, బెంగుళూర్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సంఘ సమావేశం వారు ఇందుకు అంగీకరించలేదు. శ్రీ ఎస్. కె. పాటిల్‌ను పోలిన కాంగ్రెస్ అధ్యక్షుని అనుయాయులు "నేటిక్లిష్ట పరిస్థితులలో బాబూ టాండన్ నాయకత్వం దేశానికి అత్యవసర" మని చెప్పి, కాంగ్రెస్ నాయకత్వాన్ని పండిట్ నెహ్రూ స్వీకరించాలనే ప్రతిపాదనను త్రోసిపుచ్చారు.

కాంగ్రెస్ సంస్థ ప్రస్తుత నిర్వహణ విధానం పట్ల అసంతృప్తి చెందినవారు దానినుంచి వైదొలగకుండా చేసి, కాంగ్రెస్‌వాదులలో సమైక్యతను సాధించే సంకల్పంతో కాంగ్రెస్ కార్యవర్గాన్ని, కేంద్ర ఎన్నికల సంఘాన్ని పునర్నిర్మించాలని పండిట్‌జీ బెంగుళూర్ సమా